క్లుప్తంగా

వీఎంసీలో నేడు పీజీఆర్ఎస్

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో సోమవారం వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో ప్రజా ఫిర్యాదులు–పరిష్కార కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు వీఎంసీ ప్రధాన కార్యాలయంలో, చిట్టినగర్‌లోని సర్కిల్–1, సత్యనారాయణపురంలోని సర్కిల్–2, పటమటలోని సర్కిల్–3 కార్యాలయాల్లో జోనల్ కమిషనర్లు ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తారన్నారు. కార్యక్రమాన్ని నగరవాసులు సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను పరిష్కరిచుకోవాలని కమిషనర్ సూచించారు.

ఫ్రెండ్‌షిప్ డే వేడుకలో మాజీ మంత్రి వెలంపల్లి



మధురానగర్(విజయవాడసెంట్రల్): ఏలూరు రోడ్డులోని లీల గ్రాండ్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం స్నేహితుల దినోత్సవం పురస్కరించుకుని ఎస్‌కేపీవీవీ హిందూ హైస్కూల్ 1985–86 పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ సమావేశం, స్నేహితుల దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. వేడుకల్లో మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గం ఇన్‌చార్జ్ వెలంపల్లి శ్రీనివాసరావు పాల్గొని తన చిన్ననాటి స్నేహితులతో కలిసి ఆడి పాడి సందడి చేశారు. అనంతరం కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. స్నేహితులతో తన చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఆహ్లాదంగా గడిపారు.

తరిమెల నాగిరెడ్డికి నివాళి



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం మార్క్సిస్టు – లెనినిస్టు మేధావి, విప్లవోద్యమ నాయకుడు కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి 49వ వర్ధంతి సభ జరిగింది. సభలో పాల్గొన్న వక్తలు మాట్లాడుతూ భారత సామాజిక, ఆర్థిక పరిస్థితులను 50 ఏళ్ల క్రితమే తరిమెల నాగిరెడ్డి 'తాకట్టులో భారతదేశం' గ్రంథంలో విశ్లేషించారన్నారు. ఎమర్జెన్సీ కాలంలో ప్రజలను సమీకరించడం, విప్లవకారులను ఐక్యం చేసే లక్ష్యంతో అహోరాత్రులు కృషి చేశారని వివరించారు. ఎమర్జెన్సీ కాలంలో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ అమరులయ్యారని తెలిపారు. సభలో సీపీఐ(ఎంఎల్) జిల్లా కార్యదర్శి యు. వీరబాబు, మరీదు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి

పటమట(విజయవాడతూర్పు): రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని పోలీస్ అధికారులు సూచించారు. విజయవాడ పోలీసు కమిషనరేట్ పరిధిలోని అన్ని పోలీసు స్టేషన్లు, టాస్క్‌ఫోర్స్ కార్యాలయాల్లో పోలీసు అధికారులు, సిబ్బందితో రౌడీషీటర్లకు, లా – ఆర్డర్ క్రైమ్ సస్పెక్ట్‌లకు, చెడునడత కలిగిన వ్యక్తులకు సిటీ పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు ఆదేశాల మేరకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ప్రతి ఒక్కరూ ఎలాంటి నేరాలకు పాల్పడకుండా నేర ప్రవృత్తిని మాని మంచి నడవడికతో, సత్ప్రవర్తనతో మెలగాలన్నారు. అసాంఘిక కార్యక్రమాల్లో పాల్గొవద్దని, ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల వినియోగం, అక్రమ రవాణా చేయకుండా సత్ప్రవర్తన మార్గంలో నడవాలని, ప్రతి ఒక్కరు చెడు వ్యసనాలను మానుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరిపై పోలీస్ నిఘా ఏర్పాటు చేశామని, నేరాల్లో పాల్గొంటే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గ్రంథాలయాలను వినియోగించుకోవాలి



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బందరు రోడ్డులోని ఠాగూర్ గ్రంథాలయంలో 100 మంది ఏపీఎస్ఆర్ఎం పాఠశాల విద్యార్థులకు శాశ్వత సభ్యత్వం కల్పించారు. ఆదివారం కాకాని వెంకటరత్నం 125వ జయంతి ఘనంగా నిర్వహించారు. కాకాని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాకాని మనువడు కాకాని తరుణ్ విద్యార్థులకు గ్రంథాలయంలో శాశ్వత సభ్యత్వం బహుకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రంథాలయానికి వచ్చి చదువుకునేందుకు వీలుగా సభ్యత్వం కల్పించడం జరిగిందని తెలిపారు. విద్యార్థులకు శాశ్వత సభ్యత్వం బహుకరించిన కాకాని తరుణ్‌ను గ్రంథాలయాధికారి రమాదేవి సత్కరించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

పాతబస్తీ ముంపు సమస్య తీరేదెప్పుడు ?

- వర్షం వస్తే చెరువులను తలపిస్తున్న పాతబస్తీ వీధులు
- తరచూ మునుగుతున్న కొత్తపేట, వించిపేట, మహంతీపురం, ఇస్లాంపేట
- ముంపు నివారణకు శాశ్వత చర్యలు చేపట్టాలంటున్న స్థానికులు



సుబ్బరామయ్య వీధిలో నిలిచిన వర్షపు నీరు (ఫైల్)

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వర్షం కురిస్తే వన్‌టౌన్‌లోని పలు ప్రాంతాలు చెరువులను తలపిస్తున్నాయి. పాతబస్తీలోని కొత్తపేట, వించిపేట, మహంతీపురం, ఇస్లాంపేట, గొల్లపాలెంగట్టు రోడ్డు వర్షాకాలం వచ్చిందంటే చాలు ఆయా వీధులన్నీ జలమయంగా మారుతుంటాయి. పశ్చిమ నియోజకవర్గంలో వర్షం దంచికొట్టిందంటే మోకాలిలోతు నీరు రోడ్లపై చేరి తటాకాలను తలపిస్తాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఆయా రహదారులపై రాకపోకలు సాగించలేక ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. కొండ ప్రాంతాల్లో పడిన వర్షపునీరు దిగువ భాగంలో ఉన్న కాలువల్లో చేరి మురుగంతా వర్షపు నీటితో కలిసి రోడ్ల మీద పారుతోంది. మలమూత్రాలు సైతం కొట్టుకు వస్తున్నాయి. రోడ్లు లోతట్టుగా ఉండడం, కాలువలు విస్తరించకపోవడంతో ఈ దుస్థితి ఏర్పడుతోంది. ముంపు నివారణకు తీసుకుంటున్న చర్యలు శూన్యమని, ఈ వర్షాకాలం ఎలా గడుస్తుందోనని ప్రజలు భయపడుతున్నారు.

ప్రత్యామ్నాయాలపై దృష్టి పెట్టాలి

పాతబస్తీలోని ముంపు సమస్యను నివారించేందుకు అధికారులు ప్రత్యామ్నాయాలపై దృష్టి పెట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. ప్రధానంగా భౌగోళికంగా కొన్ని ఇబ్బందులున్నప్పటికీ వాటిని అధిగమించే దిశగా పాలకులు చర్యలు తీసుకోవాలని స్థానిక నివాసితులు సూచిస్తున్నారు. చుట్టూ కొండల కారణంగా నీరు చాలా వేగంగా రోడ్లపైకి చేరటం, బయటకు వెళ్లేందుకు సమయం తీసుకోవటంతో సమస్యలు ఏర్పడుతున్నాయని, వాటిని నివారించేందుకు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

సమస్యలను పట్టించుకోవటం లేదు

కాసేపు వర్షం కురిస్తే చాలు మా ప్రాంతంలో వీధులన్నీ జలమయంగా మారతాయని స్థానిక ప్రజానీకం ఆవేదన వ్యక్తం చేస్తోంది. ఆ నీటిలోనే రాకపోకలు సాగించాలి. కాలువలు చిన్నవిగా ఉన్నాయి. ఈ సమస్య గురించి ఎన్నిమార్లు విన్నవించుకున్నా ఏ ఒక్కరూ పట్టించుకోవడం లేదంటూ పలువురు స్థానికులు వ్యాఖ్యానిస్తున్నారు. అనేక సంవత్సరాలుగా నానా అవస్థలు పడుతున్నామని, ఇప్పటికైనా మా గోడు ఆలకించి కూటమి ప్రభుత్వ పాలకులు దృష్టి సారించి సమస్యను పరిష్కరించాలని వించిపేట నివాసితులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ముంపు సమస్యను నివారించాలి..



పాతబస్తీలోని పలు ప్రాంతాలు వర్షాలు పడిన ప్రతి సారి ముంపు సమస్యను ఎదుర్కొంటున్నాయి. కొత్తపేట, వించిపేట, ఇస్లాంపేటల్లోని చాలా ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచిపోయి రాకపోకలకు సైతం ఇబ్బందులు తలెత్తుతుంటాయి. అధికారులు ముంపు సమస్యను శాశ్వతంగా నివారించేందుకు చర్యలు చేపట్టాలి. గత ప్రభుత్వం జెండా చెట్టు నుంచి కెనాల్‌లోకి వెళ్లేందుకు డైవర్షన్ ఛానల్‌ను ఏర్పాటు చేసింది. అలాగే మిగిలిన ప్రాంతాల్లోనూ చర్యలు చేపట్టాలి.

– గురుమహంతు మహేష్, వైఎస్సార్ సీపీ 53వ డివిజన్ ఇన్‌చార్జి

వ్యాపార వర్గాలకు అండగా ఉంటాం

- కూటమి భారాలతో ఇతర రాష్ట్రాల వ్యాపారులు స్వరాష్ట్రాలకు వెళ్తామంటున్నారు.
- వ్యాపారులపై దాడులు చేయించి ఇబ్బందులకు గురి చేస్తున్నారు
- వైఎస్సార్ సీపీ పశ్చిమ ఇన్‌చార్జి వెలంపల్లి



క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న వెలంపల్లి, నాయకులు



క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న వెలంపల్లి, రెహమతున్నీసా తదితరులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వివిధ రాష్ట్రాల నుంచి వచ్చి వ్యాపారాలు చేసుకుంటున్న వ్యాపారులపై కూటమి ప్రభుత్వం చేస్తున్న దోపిడీని ఆపాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వ్యాపారులు తమ ప్రభుత్వ భారాలను భరించలేక తమ స్వరాష్ట్రాలకు వెళ్లిపోతామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారని వెలంపల్లి పేర్కొన్నారు. వారికి తమ పార్టీ అండగా ఉంటుందని వెలంపల్లి శ్రీనివాసరావు భరోసా ఇచ్చారు. స్థానిక 37వ డివిజన్ స్థానిక కార్పొరేటర్ మండెపూడి ఛటర్జీ కార్యాలయంలో ఆయన అధ్యక్షతన 'బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ' చంద్రబాబు మేనిఫెస్టోను గుర్తుకు తెస్తూ డివిజన్ విస్తృత స్థాయి సమావేశం ఆదివారం నిర్వహించారు.

సమావేశంలో వెలంపల్లి శ్రీనివాసరావు, ఏపీ జైన్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మనోజ్‌కొఠారి, క్లస్టర్ ఇన్‌చార్జ్ బొండా నిరీష్, పలు వ్యాపారస్తులు, ఆయా డివిజన్ పార్టీ నాయకులు పాల్గొన్నారు. బాబు మోసాలను, ప్రజలకు ఇచ్చిన బాండ్లు, వైఎస్ జగన్ ప్రసంగాన్ని టీవీలో చూపించారు. ఇంటింటికి క్యూ ఆర్ కోడ్ తో వెళ్లి ప్రజలతో దానిని స్కాన్ చేపించి కూటమి మోసాలను వివరించాలని కోరుతూ క్యూఆర్ కోడ్‌ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి వెలంపల్లిని వ్యాపారస్తులు కలిసి కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అధికారుల వల్ల తాము అనేక ఇబ్బందులు ఎదురుకుంటున్నామని, తాము ఇక్కడ వ్యాపారం చేయడం సాధ్యం కావడం లేదని విజయవాడను వదిలి తిరిగి గుజరాత్ ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లిపోతున్నామని తమ గోడును వ్యక్తం చేశారు. దానిపై వెలంపల్లి స్పందిస్తూ వ్యాపారస్తులు రాష్ట్రం వదిలి వెళ్లిపోవాలనే ఆలోచన మార్చుకోవాలని, వ్యాపారస్తులకు వైఎస్సార్ సీపీ అండగా నిలుస్తుందని చెప్పారు. అలాగే వ్యాపారుల సమస్యలపై పోరాడతామని కూటమి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అమరావతి పేరుతో కూటమి కాలయాపన చేస్తోందన్నారు. ఏడాదికి రెండు లక్షల రూపాయల లబ్ధి చేకూరుతుందని ఐదేళ్లకు రూ.10 లక్షలు లబ్ధి చేకూరుతుందని చంద్రబాబు, పవన్ కల్యాణ్ రాష్ట్రంలో పత్రాలను, బాండ్లను పంచి ప్రజలను మోసం చేశారన్నారు. చంద్రబాబు చేసిన మోసాలను, జగన్ చేసిన మంచిని ప్రజలలోకి తీసుకువెళ్లాలని పార్టీ శ్రేణులకు సూచించారు.

5 లక్షల పింఛన్లు తొలగించారు

కొత్త పింఛన్లు ఇవ్వకపోగా ఉన్న సుమారు 66 లక్షల పింఛన్లలో 5 లక్షలు తొలగించిన ఘనత చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వానిదేనని వెలంపల్లి మండిపడ్డారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కూటమి ప్రభుత్వంపై తీసుకువచ్చిన ఒత్తిడితో గతేడాది వదిలేసి ఈ ఏడాది నామమాత్రంగా తల్లికి వందనం పేరుతో కొంత మందికి ఇచ్చారని తెలిపారు. ఇక చేయూత, ఫీజు రీయంబర్స్‌మెంట్, వసతి దీవెన, విద్యా దీవెన వంటి పథకాలు ఇకపై ఇస్తారో లేదో తెలియని అయోమయ పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. మహిళలకు ఉచిత బస్ ద్వారా రాష్ట్రం మొత్తం తిరగవచ్చని హామీ ఇచ్చి ఇప్పుడు జిల్లా వరకే పరిమితం చేయడం మహిళలను మోసం చేయడం కాదా అని ప్రశ్నించారు.

లోకేష్ భవిష్యత్‌కు చంద్రబాబు గ్యారెంటీ

చంద్రబాబు గ్యారెంటీ అంటే కేవలం తన తనయుడు, మంత్రి నారా లోకేష్ భవిష్యత్‌కు మాత్రమే అని కార్పొరేటర్ షేక్ రెహమతున్నీసా ఎద్దేవా చేశారు. చంద్రబాబు మాటలు నమ్మరనే ఉద్దేశంతో పవన్ కల్యాణ్‌తో కలిసి సంతకాలు చేసి ఎన్నికలకు ముందు ప్రజలకు బాండ్లు ఇచ్చారని గుర్తు చేశారు. ఇప్పుడు సుపరిపాలన అంటూ వస్తున్న కూటమి నాయకులను వారు ఇచ్చిన బాండ్ల గురించి నిలదీయాలని చెప్పారు. కార్యక్రమంలో క్లస్టర్–1 అధ్యక్షుడు బొండా నిరీష్, పార్టీ నాయకులు షేక్ హయాత్ షరీఫ్, ఎస్‌కే నజీర్, దాసి జయప్రకాష్ కెనడి, పాదిలి చంటిబాబు, గోమతోటి వినోద్, విజయ్, ఇర్ఫాన్, ఇస్మాయిల్, రవూఫ్, మంటి రాము, బి.శాంతి, సీత, వీరమ్మ, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

మోసం, దగా, వంచనకు చిరునామా చంద్రబాబు

భవానీపురం(విజయవాడపశ్చిమ): 40 ఏళ్ల ఇండస్ట్రీ అని చెప్పుకునే చంద్రబాబు రాజకీయ జీవితం అంతా మోసం, దగా, వంచనే అని వైఎస్సార్ సీపీ పశ్చిమ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావు విమర్శించారు. చంద్రబాబు మేనిఫెస్టోను గుర్తుకు తెస్తూ 38వ డివిజన్ కార్పొరేటర్ షేక్ రెహమతున్నీసా, వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకుడు షేక్ హయాత్ షరీఫ్ ఆధ్వర్యంలో ఆదివారం విద్యాధరపురంలోని కుమ్మరిపాలెం సెంటర్‌లో బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమం జరిగింది. తొలుత వైఎస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం చంద్రబాబు మోసాలకు సంబంధించిన క్యూఆర్ కోడ్‌ను కార్పొరేటర్ రెహమతున్నీసాతో కలిసి వెలంపల్లి ఆవిష్కరించారు. క్యూఆర్ కోడ్‌ను ప్రజల వద్దకు తీసుకువెళ్లి స్కాన్ చేయించాలని, తద్వారా చంద్రబాబు చేసిన మోసాలు వారికి తెలియజేయాలన్నారు.



● కృష్ణమ్మ చెంత ఆహ్లాదం



కృష్ణానదికి వరద ప్రవాహంతో ప్రకాశం బ్యారేజీ వద్ద ఆదివారం సందర్శకుల తాకిడి నెలకొంది. నగర వాసులు కుటుంబ సభ్యులతో కలిసి వచ్చి కృష్ణానది వెంబడి ఆహ్లాదంగా గడిపి సెల్ఫీలు దిగి సందడి చేశారు. విద్యుత్ వెలుగులో ప్రకాశం బ్యారేజీ ఆకట్టుకుంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



కళాకారులకు ఆత్మీయ సత్కారం

విజయవాడ కల్చరల్: మిలీనియం కళాభారతి ఆధ్వర్యంలో అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవం సందర్భంగా గాంధీనగర్‌లోని కౌతా పూర్ణానందం కళావేదికపై ఆదివారం వివిధ రంగాలకు చెందిన కళాకారులకు ఆత్మీయ సత్కార కార్యక్రమం నిర్వహించారు. తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు, విశ్రాంత పోలీస్ అధికారి కే డేవిడ్‌రాజు మాట్లాడుతూ స్నేహానికి జాతి, కులమత, ప్రాంతీయ బేధాలు లేవన్నారు. కుంచం మోహనరావు ఆధ్వర్యంలో వివిధ రంగాలకు చెందిన డేవిడ్‌రాజు, చిట్టిబాబు, కే రాజు, మాడుగుల రామకృష్ణ, డాక్టర్ యూవీ రత్నం, కేఎస్ఆర్ దాసులను సత్కరించారు.

ముగిసిన మట్టిమనిషి నాటక ప్రదర్శన



మట్టిమనిషి నాటకంలోని సన్నివేశం

విజయవాడ కల్చరల్: అభ్యుదయ రచయితల సంఘం, జాషువా కళావేదిక, పోలవరపు కోటేశ్వరరావు సాహితీ సమితి, ఫొటో ఇండియా సహకారంతో మిత్రా క్రియేషన్స్ హైదరాబాద్ బృందం రెండు రోజులపాటు ప్రదర్శించిన 'మట్టిమనిషి' నాటకం ప్రదర్శన ఆదివారం ముగిసింది. వాసిరెడ్డి సీతాదేవి రచించిన మట్టిమనిషి నవలకు నాటకీరణ అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరి శివప్రసాద్, దర్శకత్వం ఎస్ఎమ్ భాషా. రైతు జీవితానికి అద్దం పట్టిన నాటక ప్రదర్శనలో 50 మంది నటీనటులు పాల్గొన్నారు. మూడు గంటలపాటు ప్రదర్శింపబడిన ఈ నాటకంలో ప్రతీ సన్నివేశం నటీనటుల ప్రతిభకు అద్దం పట్టింది. కార్యక్రమంలో అరసం బాధ్యులు పరుచూరి అజయ్‌కుమార్, అరుణ్ కుమార్, గోళ్ల నారాయణరావు, టీ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మొక్కలు నాటుతున్న మల్లికార్జునరెడ్డి, ఫౌండేషన్ సభ్యులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత కావాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకుని హరివిల్లు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం వన్‌టౌన్‌లోని గాంధీజీ మున్సిపల్ హైస్కూల్‌లో పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పాఠశాల ప్రధానోపాధ్యాయులు కందుల మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ భూమిలో నీటి నిల్వలు తగ్గిపోవడానికి కారణం వర్షపాతానికి ఉపయోగపడే చెట్లు తగ్గిపోవడమేనన్నారు. నగరీకరణ పెరుగుతున్న ప్రస్తుత రోజుల్లో మొక్కలు పెంచే అవకాశం లేక భూతాపం పెరిగిపోతుందని చెప్పారు. హరివిల్లు ఫౌండేషన్ అధ్యక్షుడు ఎం.శశికాంత్ మాట్లాడుతూ స్నేహితుల దినోత్సవం రోజున ప్రకృతితో స్నేహం చేసి పచ్చదనాన్ని పెంచాలన్న ఉద్దేశంతో మొక్కలనాటే కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. ఈ మొక్కలు భావితరానికి నీడనిచ్చే వృక్షాలుగా ఎదిగితే తమ సంకల్పం నెరవేరినట్లేనని చెప్పారు. కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపకులు, ప్రధాన కార్యదర్శి డాక్టర్ శరత్ కుమార్, ఉపాధ్యక్షుడు ఎస్‌కే మహమ్మద్ రఫీ, సభ్యులు ఎం.బాల సూర్యనారాయణ, శ్రీదేవి, మన్నే రామకృష్ణ, కె.శ్రీనివాసరావు, జీఎస్‌బీ అప్పలరాజు, కొమెర రాజు తదితరులు పాల్గొన్నారు.

శాఖాభేదాలు విస్మరించి వివాహాలు నిశ్చయం చేసుకోవాలి

బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు బలరామకృష్ణమూర్తి



మాట్లాడుతున్న కొప్పరపు బలరామకృష్ణమూర్తి

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): శాఖాభేదాలు విస్మరించి తమ పిల్లల వివాహాలు నిశ్చయం చేసుకోవాలని బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు కొప్పరపు బలరామకృష్ణమూర్తి తల్లిదండ్రులకు సూచించారు. బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సత్యనారాయణపురంలోని శ్రీసీతారామ కల్యాణ మండపంలో 45వ బ్రాహ్మణ వివాహ పరిచయ వేదిక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బాలరామకృష్ణమూర్తి మాట్లాడుతూ వివాహ పరిచయ వేదికను సద్వినియోగం చేసుకుని తల్లిదండ్రులు సకాలంలో తమ పిల్లలకు వివాహం జరిగేలా చూడాలన్నారు. ఉన్నతమైన, ఆదర్శవంతమైన విలువలతో త్వరితగతిన వివాహాలు చేసుకోడానికి బ్రాహ్మణ సేవా సంఘం పూర్తి తోడ్పాటును అందిస్తుందని తెలిపారు. ఈ వేదికలో 400 దరఖాస్తులు రాగా వాటిలో 10 సంబంధాలు పరస్పర అనుకూలంగా స్పందన తెలియజేయడం జరిగిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘ కార్యదర్శి తణుకు రామకృష్ణ, కోశాధికారి పెద్దిభొట్ల కాశీ విశ్వనాథం, మల్లాది ఆంజనేయశర్మ, గరికపాటి కోటేశ్వరశర్మ, సుందరి, వరప్రసాద్, పింగళి వెంకటేశ్వర తదితరులు పాల్గొన్నారు.

కాకాని ఉద్యమ స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకోవాలి

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్



కాకాని విగ్రహానికి పూలమాలలు వేస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, తరుణ్ కాకాని

లబ్బీపేట(విజయవాడతూర్పు): స్వాతంత్ర్య సమర యోధుడు, జై ఆంధ్రా ఉద్యమ నేత కాకాని వెంకటరత్నం ఉద్యమ స్ఫూర్తిని ప్రతి రాజకీయ నాయకుడు ఆదర్శంగా తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. కాకాని వెంకటరత్నం జయంతిని పురస్కరించుకుని కాకాని ఆశయ సాధన సమితి అధ్యక్షుడు తరుణ్ కాకాని ఆధ్వర్యంలో బెంజిసర్కిల్‌లో పేదలకు చీరలు, దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథి పాల్గొన్న పీవీఎన్ మాధవ్ తొలుత కాకాని వెంకటరత్నం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విజయవాడ గడ్డ రాజకీయ నాయకుల అడ్డా అని, స్వాతంత్ర్య సమరయోధులలో ముందు వరుసలో ఉండే వ్యక్తి కాకాని వెంకటరత్నం అన్నారు. విజయవాడలో కాంగ్రెస్ మహా సభలు నిర్వహించారన్నారు. మూడు సార్లు ఎమ్మెల్యేగా, రాష్ట్ర వ్యవసాయ మంత్రిగా సేవలందించారన్నారు. పొట్టి శ్రీరాములు ప్రేరణతో జై ఆంధ్రా ఉద్యమాన్ని నడిపారని, ప్రతి రాజకీయ నాయకుడు ఆయన ఉద్యమ స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. అనంతరం పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, కాకాని ఆశయ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు తరుణ్ కాకాని తదితరులు పాల్గొన్నారు.

పత్తి ఆధారిత పరిశ్రమలను ప్రోత్సహించాలి

రెండు రోజుల అవగాహన సదస్సులో నిపుణులు



సదస్సులో పాల్గొన్న వివిధ సంస్థల ప్రతినిధులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): పత్తిగింజలలో పోషక విలువలు, నూనె తయారీ పరిశ్రమలో శాస్త్రీయ దృష్టి అవసరం వంటి అంశాలపై పలువురు నిపుణులు చర్చించారు. విజయవాడలో భారత్ సాల్వెంట్ ఎక్స్‌ట్రాక్టర్స్ సంఘం, ఆల్ ఇండియా కాటన్ సీడ్ క్రషర్స్ అసోసియేషన్ సంయుక్తంగా రెండు రోజుల పాటు సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో దేశ వ్యాప్తంగా వంట నూనె భద్రత, పశుపోషకాహారం, గ్రామీణ అభివృద్ధి, పరిశోధనలో కొత్త మార్గాలపై చర్చించారు. పత్తి గింజకు ప్రాణం పోసి–నూనె తదితర వినియోగాల్లో అభివృద్ధి మార్గాలు అనే అంశంపై సాగిన సదస్సులో 60 మందికిపైగా నిపుణులు ప్రసంగించారు. పత్తిసాగు నుంచి వంటనూనె, మేళ్ తయారీ, మార్కెట్ అభివృద్ధి, బ్రాండింగ్, పరిశోధన, విధానాలు, వృద్ధి అంశాలపై చర్చలు జరిగాయి. గుజరాత్‌లో వినియోగం విస్తరణ విజయవంతంగా సాగుతున్న నేపథ్యంలో, దక్షిణ భారతదేశంలో ప్రజలలో అవగాహన పెంచేందుకు బ్రాండింగ్, డిజిటల్ ప్రచారం, విశ్వసనీయ కథనాలు, ప్రేరణాత్మక ప్రచారానికి పెద్దపీట వేయాలని నిర్ణయించారు. విద్యార్థుల విభాగంలో హైదరాబాద్‌లోని సీఎస్ఐటీ–ఐఐసీటీకి చెందిన రౌషన్ రాజ్ సిన్హా, ముంబయికి చెందిన అలియా సలీం షేక్, డాక్టర్ అమిత్ పార్థప్ తదితరులు ఉత్తమ విశ్లేషణలతో బహుమతులు పొందారు. నిర్వాహక సంస్థల ప్రతినిధులు నీలేష్ పటేల్, అంగ్షు మాలిక్, సందీప్ బజోరియా తదితరులు పాల్గొన్నారు.

గురువు భగవంతుడితో సమానం



సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): స్థానిక సత్యనారాయణపురంలోని శిశు విద్యామందిర్ ప్రాంగణంలో ఆదివారం భారత్ వికాస్ పరిషత్ విజయవాడ శాఖ ఆధ్వర్యంలో 'గురువందన – ఛాత్రాభినందన' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా గుంటూరులోని హిందూ కళాశాల భౌతికశాస్త్ర విభాగాధిపతి పీవీ రాములు పాల్గొని ప్రసంగించారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువుకు కృతజ్ఞతలు తెలిపేదే గురువందన కార్యక్రమం అని అన్నారు. మనకు జ్ఞానాన్ని, మార్గదర్శకత్వాన్ని నేర్పించే గురువు భగవంతుడితో సమానంగా చూసుకుంటామన్నారు. గురువు లేకుండా విద్య లేదని.. విద్య లేని జీవితం వెలుగు లేనిదవుతుందన్నారు. గురువును గౌరవించుకోవడం మన కర్తవ్యమని వివరించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల్లోని పలువురు ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. అనంతరం విద్యార్థులకు నోట్ పుస్తకాలు, మెరిట్ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేశారు. భారత్ వికాస్ పరిషత్ చైర్మన్ తెలప్రోలు వీరయ్యగుప్త, కన్వీనర్‌గా చిలకల నాగేశ్వరరావు, అధ్యక్షుడు చెందోలు ఆంజనేయులు, కదం కృష్ణమూర్తి, చుండూరి మురళీధర్, ఎన్.ఎస్.వి. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.